క్లుప్తంగా

మొగలిపాలెంలో రేపు ఒనుములమ్మ జాతర


మొగలిపాలెంలో ఒనుములమ్మ తల్లి

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం, మంజేరు గ్రామాల సరిహద్దులో ఇరు గ్రామాల ఉమ్మడి గ్రామ దేవత ఒనుములమ్మ జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా ఉగాది అనంతరం వచ్చే అమావాస్య రోజున అమ్మవారికి జాతర, తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. మంజేరులోని గండి వారి ఆడపడుచుగా పిలవబడే ఒనుములమ్మ మొగలిపాలెం, కొత్త మంజేరు, పాత మంజేరు, శీల గ్రామాల ప్రజల నుంచి గ్రామ దేవతగా పూజలందుకుంటుంది. శనివారం రాత్రి మంజేరు గ్రామ వీధుల్లో జాతర నిర్వహించనున్న నిర్వాహకులు ఆదివారం మధ్యాహ్నం నుంచి మొగలిపాలెంలో తీర్థం నిర్వహించనున్నారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందనలు

కపిలేశ్వరపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు గానూ 555 మార్కులు సాధించిన పడమర ఖండ్రికకు చెందిన విద్యార్థిని యర్రంశెట్టి చైతన్యను గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి అభినందించారు. గ్రామానికి చెందిన ఓ ఔత్సాహికుడు విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతిగా రూ.5 వేలు అందజేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


అంగరలో వసుంధరకు నివాళులర్పిస్తున్న ఇరు గ్రామాల ప్రజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన బలుసు వసుంధర జ్ఞాపకార్థం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. వసుంధర ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గ్రామంలోని ఆమె విగ్రహం వద్ద నివాళులర్పించారు. వసుంధర కుటుంబ సభ్యులు బలుసు జానకిరామయ్య మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామి కాపు, నాయకులు పుత్సల శ్రీనివాస్, పిల్లా బసవరాజు, తిరునాతి వెంకటేశ్వరరావు, తోరాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు


రాయవరంలో ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేయించుకుంటున్న కార్మికులు

రాయవరం: గ్రామంలో కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుల నమోదు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. కార్మిక శాఖ సహాయ అధికారి టీఎస్ కార్తీక్ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డుల నమోదును ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ-శ్రమ్ కార్డుల నమోదు ప్రక్రియను స్థానిక వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. 150 మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ కార్డులను నమోదు చేయించుకున్నారు. శనివారం కూడా నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, దీనిని అసంఘటిత రంగ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎల్‌వో కార్తీక్ తెలిపారు. కార్మిక శాఖ కో ఆర్డినేటర్లు సాల్మన్‌రాజు, సుప్రియ, వీరబాబు, జూనియర్ అసిస్టెంట్ సుధ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి బీమా చెక్కు అందజేత


వెలగతోడులో వరలక్ష్మి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కపిలేశ్వరపురం (మండపేట): గుండెపోటుతో మృతి చెందిన మండపేట రూరల్ మండలం వెలగతోడు గ్రామానికి చెందిన తోట వరలక్ష్మి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు నగదు చెక్కును శుక్రవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు తాపేశ్వరం బ్రాంచి మేనేజర్ వై.రాజేష్, డిప్యూటీ మేనేజర్ కె.అర్జునరావు లబ్ధిదారు కుటుంబానికి అందజేశారు.

చివరికి ఒడ్డు చేరిన దాళ్వా

- నారుమడుల దశలోనే తలెత్తిన నీటి ఎద్దడి
- చిరుపొట్ట దశలో నీరులేక తడారిపోయిన చేలు
- ప్రేక్షకపాత్ర వహించిన సాగునీటి సంఘాలు
- వంతులవారీ విధానంతో గట్టెక్కిన అన్నదాత


కాజులూరులో ఆశాజనకంగా ఉండి కోతకు వచ్చిన వరిచేను


మొగలిపాలెంలో మాసూళ్లు చేసిన పంటను ఆరబెడుతున్న రైతులు

కాజులూరు: ఈ ఏడాది డెల్టాలోని దాళ్వాకు నీటి ఎద్దడి తలెత్తి వరి సాగు పశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా తూర్పు డెల్టాలోని కాలువ శివారు భూముల్లో ఉన్న రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు మండల గ్రామాల్లో నాట్లు వేసిన తొలిదశలోనే సాగునీరు అందకపోవటంతో ఇక దాళ్వా చివరి వరకూ సాగుతుందా...? అని రైతులలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా పంట చిరుపొట్ట దశలో నీరు లేక పొలాలు తడారిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఏడాది ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు కొత్తగా ప్రతినిధులను నియమించింది. అయితే రాజకీయ నిరుద్యోగతను పూరించుకునేందుకు కూటమి నేతలు పోటాపోటీగా సాగు నీటి సంఘాలపై అవగాహన లేని వ్యక్తులను నేతలుగా నియమించారని దీంతో వారు సమస్యపై ప్రేక్షకపాత్ర వహించడంతో అధికారులు సైతం సాగునీటి సరఫరాలో నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరించారని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అయితే భారీ స్థాయిలో సాగునీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ రైతులు ఐక్యతతో వ్యవహరించి వంతుల వారీ విధానంతో కాలువ శివారు భూములకు నీరందించడంతో సాగు సాఫీగా ముందుకు సాగి దాళ్వా పంట నీటి ఎద్దడిని అధిగమించి చివరి దశకు చేరుకుంది. కాజులూరు మండల గ్రామాలలో ఈ ఏడాది మొత్తం 18,076 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేపట్టగా సుమారు 50 శాతం పంట ప్రస్తుతం పక్వానికి వచ్చి కోత దశకు చేరుకుందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. ఈ నెల చివరినాటికి సుమారు 60 శాతం పంట కోతలు జరుగగా మే మొదటి వారాంతానికి నూరుశాతం పంట నూర్పిళ్ళు పూర్తి కావచ్చన్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో వరి పంట దాదాపు నీటి సరఫరా అవసరం లేకుండా ఒడ్డుకు చేరినట్టేనని అక్కడక్కడా కొన్ని చోట్ల పక్వానికి వచ్చి ఉన్నచోట ఒక ఆరుతడి ఇస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. పంట సుమారు హెక్టారుకి 125 బస్తాల చొప్పున దిగుబడి ఆశాజనకంగా వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలు పూడుకుపోయి ఎద్దడి



ఈ ఏడాది గోదావరిలో నీటి నిల్వలు పుష్కలంగా ఉండటంతో దాళ్వాలో సాగునీటి ఎద్దడి ఉండదని బావించాం. అయితే పంట కాలువలు పూడికపోయి ఉండటంతో ప్రధానకాలువల నుంచి సాగునీరు పొలాలకు చేరలేదు. దీంతో సాగు తొలి దశ నుంచి ఇబ్బందులు పడుతూ వచ్చాం. ప్రభుత్వం స్పందించి పంటకాలువలు తవ్వించాలి.

– అణసూరి శివన్నారాయణ, రైతు, ఆర్యావటం

అనుభవం లేకే సాగునీటి ఇబ్బందులు



సాగునీటి సరఫరాపై అనుభవం లేని రాజకీయ నాయకులను ప్రభుత్వం నీటి సంఘాలకు ప్రతినిధులుగా ఎంపిక చేసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా వారు ఏమీ పట్టించుకోలేదు. ఫలితంగా ఇరిగేషన్ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. ఏది ఏమైనప్పటికీ దేవుని దయవల్ల చివరకు దాళ్వా పంట ఆశాజనకంగా ధాన్యం ఒడ్డుకు చేరింది.

– గెద్దం కన్నంరాజు, రైతు, గొల్లపాలెం

ఆటో డ్రైవర్‌కు చైర్‌పర్సన్ పరామర్శ


మండపేటలో అంజిని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆటో డ్రైవర్ మానే అంజిని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తాడి రామారావు, పేరూరి మాధవి ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం, బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం, విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్ ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు.

మహమ్మారిని తరిమేద్దాం


అంగరలో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది


దంగేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

- ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

కపిలేశ్వరపురం: అవగాహన అనే ఆయుధంతో మలేరియాను అరికడదామని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక గామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేశారు. సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎల్‌టీ ఆలీ, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, వైద్య ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మలేరియా దినోత్సవం

కె.గంగవరం: మండలంలోని దంగేరు, పేకేరు గ్రామాల్లో శుక్రవారం మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, సబ్‌సెంటర్ సిబ్బంది ప్లకార్డులు, నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పేకేరు పీహెచ్‌సీ వద్ద డాక్టర్ రేఖారాణి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా వ్యాధి ఏ విధంగా వస్తోంది, వచ్చిన తరువాత చికిత్స విధానం గురించి విపులంగా ప్రజలకు వివరించారు. పీవీవీఎస్ఎన్ మూర్తి, ఎంపీహెచ్ఈఓ రాజశేఖర్, వైద్య సిబ్బంది మంగాదేవి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈత.. హద్దు మీరితే వెత !


మండపేట ప్రధాన కాలువలో స్నానం చేస్తున్న చిన్నారులు

రాయవరం: వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు పలువురు చిన్నారులు కాలువల్లో ఈతకు దిగి స్నానాలు చేస్తున్నారు. ఒక పక్క ప్రతి రోజు ఎక్కడో చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలు చూస్తున్నాం. మండే ఎండల్లో కాలువల్లో స్నానం ప్రమోదాన్నిచ్చినా..దాని వెనుక ప్రమాదం దాగి ఉంది. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలి. మండలంలోని పసలపూడిలో చిన్నారులు ప్రధాన కాలువలో జలకాలాటాడుతున్న దృశ్యమిది.

విజయదుర్గా పీఠాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ 'సోము'


పీఠాధిపతి గాడ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు దంపతులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సతీసమేతంగా సందర్శించారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వరలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్)ను కలిశారు. గాడ్‌ను సోము వీర్రాజు దంపతులు దుశ్శాలువాతో సత్కరించి, ఆయన ఆశీస్సులు పొందారు. పీఠం ప్రతినిధులు ఎమ్మెల్సీ వీర్రాజు దంపతులను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అలాగే పీఠంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు దంపతులను బీజేపీ నాయకులు చాట్రాతి జానకిరాంబాబు ఘనంగా సత్కరించారు. ఇటీవల బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీదేవిని ఎమ్మెల్సీ వీర్రాజు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ వెంట బీజేపీ నాయకులు నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈరెళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముష్కరులను కఠినంగా శిక్షించాలి


మండపేటలో శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు, జేఏసీ నాయకులు


ద్రాక్షారామ ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- ఉగ్రదాడిని ఖండించిన ముస్లింలు
- మండపేటలో శాంతి ర్యాలీ

కపిలేశ్వరపురం (మండపేట): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద ముష్కరుల దాడిని మండపేటలోని ముస్లింలు ఖండించారు. ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేస్తూ శుక్రవారం పట్టణంలో శాంతి ర్యాలీ చేశారు. పట్టణంలోని నాలుగు మసీదుల్లో నమాజ్ అనంతరం కలువపువ్వు సెంటర్ నుంచి రాజారత్న సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. ప్రపంచ శాంతి ఇస్లాం లక్ష్యమని ఉగ్రదాడులను ఇస్లాంతో ముడి పెట్టవద్దంటూ నినాదాలు చేశారు. ముస్లిం సమాజ జేఏసీ ఆధ్వర్యంలో సాగిన ర్యాలీనుద్దేశించి జమాతే ఇస్లామీ హింద్ నాయకుడు ఇబ్రహీం షరీఫ్, నాలుగు మసీదుల కమిటీల నాయకులు అల్తాఫ్, ఎండీ కరీమ్, ఎండీ ఫారూక్, షేక్ మౌలాలి, ఎండీ హర్షీ మాట్లాడారు. సాటి మనిషి పట్ల ఇస్లాం సానుకూలంగా ఉంటుందన్నారు. మనుషులను చంపడమనేదాన్ని ఇస్లాం అంగీకరించదని స్పష్టం చేశారు. పహల్గాంలో అమాయక పర్యాటకులను చంపిన ఘటన తమను ఎంతగానో కలచివేసిందన్నారు. ప్రాణాలను తీసేవారిని అల్లా క్షమించడన్నారు. ర్యాలీలో ప్రజాసంఘాల నాయకులు ధూలి జయరాజు, కోన సత్యనారాయణ మాట్లాడుతూ ఉగ్రదాడి యావత్ భారత ప్రజలను కలచివేసిందన్నారు. కార్యక్రమంలో జామియ మసీదు, గాంధీనగర్ అల్ ఆమీన్ మస్జిద్, అక్సా మసీదు, హంజ మసీదులకు చెందిన ముస్లిం సోదరులు, అమిర్, షరీఫ్, ఏపీజే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మౌలానా, కరీం, సల్మాన్ హుస్సేన్, షహిద్, కమాల్ పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలంటూ ముస్లింల ర్యాలీ

రామచంద్రపురం రూరల్: అమాయకుల రక్తంతో జీవించే ఉగ్రవాదం నశించాలి, శాంతి వికసించాలి అంటూ ద్రాక్షారామలోని మూడు మసీదుల పరిధిలోని ముస్లిం గురువులు, ముస్లింలు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బాధితులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. హింస ఆగాలి, శాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


మొసలపల్లిలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళికను చేపట్టి రైతాంగానికి గిట్టుబాటు ధరలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రైతులకు సూచించారు. మొసలపల్లిలో చేతికొచ్చిన ధాన్యం విక్రయాలకు సంబంధించి కల్లాలలో గోనె సంచుల్లో నింపుతున్న ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. గోనెసంచుల సరఫరాపై ఆరా తీసి, సంచుల్లో నింపిన ధాన్యం యొక్క తేమ శాతం, నాణ్యతను తరుగు శాతాలను రైతులను అడిగి తెలుసుకున్నారు హార్వెస్టింగ్ మెషీన్ల ద్వారా నూర్పిళ్లు చేశాక పశుగ్రాస వరిగడ్డి సేకరణ విధానాలపై ఆరా తీశారు. ధాన్యం సొమ్ములు కూడా రైతుల అభీష్టానికి అనుగుణంగా ఎటువంటి జాప్యాలకు తావు లేకుండా రెండు రోజుల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు ముక్తకంఠంతో జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ రెవెన్యూ పౌరసరఫరాల ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ల భాగస్వామ్యంతో ధాన్యం సేకరణ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. రైతుల కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మడానికి వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు తలెత్తినట్లయితే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ సెల్ నంబర్లు 83094 32487, లేదా 94416 92275 నంబర్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు.

ప్రకృతి సాగుతో మెరుగైన జీవనం


పీఎండీఎస్ విత్తనాలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న బోసుబాబు

రాజోలు: ప్రకృతి వ్యవసాయ సాగుతో మెరుగైన జీవనం కలుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. శుక్రవారం తాటిపాక యూనిట్ పరిధిలో రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించారు. అలాగే రైతులకు అందించిన పీఎండీఎస్ విత్తనాలు వేసిన పొలాలను పరిశీలించారు. పీఎండీఎస్ విత్తనాల ద్వారా 30 రకాల మొక్కలు మొలకెత్తి భూమి గుల్లగా మారుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మహిళా రైతులకు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారన్నారు. ముఖ్యంగా పెరటి సాగుతో ఆరోగ్యవంతమైన కాయగూరల ఉత్పత్తి జరుగుతుందన్నారు. మండల వ్యవసాయధికారి వై.మధుబాబు, వీఏఏలు సాయి, అబ్బాస్, పోతురాజు ప్రసన్నకుమార్, రైతులు నేల తాతారావు, పిల్లి వెంకటేశ్వరరావు, దేవళ్ల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో ఆరోగ్య రక్షణ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. అనంతరం డ్రైడే ఆవశ్యకతను వివరిస్తూ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహనకు ఉద్యోగులకు రాత పరీక్ష

కొత్తపేట: భూ పరిపాలన అంశాల్లో అధునాతన చట్టాలు, సాంకేతికతపై రెవెన్యూ, సర్వే సిబ్బంది అవగాహన కల్పించనున్నట్టు స్థానిక ఆర్‌డీఓ పి.శ్రీకర్ తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు ముఖ్యమైన చట్టాలపై అవగాహనకు శుక్రవారం రాత పరీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే ఉద్యోగులకు ఆయా విభాగాల్లో ముఖ్యమైన చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వచ్చే నెల 5న రెవెన్యూ క్విజ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు కొత్తపేట డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆలమూరు: వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, స్థానిక ఎంపీడీఓ ఎ.రాజు, కొత్తపేట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.రవికుమార్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో సురక్షిత తాగునీరు, పైప్‌లైన్‌లకు మరమ్మతులు, కుళాయిల ఏర్పాటు అనే అంశంపై డీఈ రవికుమార్ సమగ్రంగా వివరించారు. అలాగే గ్రామాల వారీగా తాగునీటి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చేతిపంపులన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకంలో అసంపూర్తి పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ రాజు పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శులు కె.మోక్షాంజలి, డి.సాయిప్రసాద్, ఎస్.వీర్రాజు, చిక్కాల వీరమాత, వి.వేణి, జె.అయ్యన్న, సీహెచ్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.